క్లుప్తంగా

తాళిబొట్టు అందజేత



పెళ్లి కుమార్తె తరఫు వారికి తాళిబొట్టు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి శనివారం మండలంలోని సలకలకొండ గ్రామానికి చెందిన నరసన్న కుమార్తె వివాహానికై తాళిబొట్టును అందజేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాల వారికి వివాహానికి సంబంధించి తాళిబొట్టు, నగదును అందజేసేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. సాయం కావాల్సిన వారు తనను నేరుగా సంప్రదించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కాలువలో పడిన విద్యార్థి.. కాపాడిన రైతులు

కౌతాళం: ప్రమాదవశత్తు కాలువలోకి పడిన విద్యార్థిని స్థానికంగా ఉన్న పొలాల్లోని రైతులు కాపాడిన ఘటన శనివారం ఉరుకుంద-ఓబుళపురం గ్రామం మధ్యలో ఎల్‌ఎల్‌సీ కాలువ వద్ద చోటు చేసుకుంది. ఓబుళపురం చెందిన విద్యార్థులు 6వ నుంచి పదవ తరగతి చదవడానికి ఉరుకుంద గ్రామానికి కాలినడక వస్తారు. మాధవరం మేజర్ కాలువ దాటే ఉరుకుందకు రావాల్సి ఉంటుంది. కాలువ మీద నడవడానికి ఏర్పాటు చేసిన ఫుట్‌వేర్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో సాయంత్రం గ్రామానికి వస్తున్న సమయంలో కాలు జారి కృష్ణ అనే 6వ తరగతి చదువుతున్న పిల్లవాడు కాలువలో పడిపోయాడు. తోటి విద్యార్థులు కేకలు వేయడంతో చుట్టూ పక్కల ఉన్న పొలాల్లోని రైతులు స్పందించి పిల్లవాన్ని కాపాడారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ అందజేత



కంప్యూటర్, ప్రింటర్ అందజేస్తున్న బ్యాంకు వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ శెట్టి

ఆదోని అర్బన్: శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ కోఆపరేటివ్ బ్యాంకు తరఫున రూ.60 వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్‌ను శనివారం పట్టణంలోని ఆర్‌ఆర్ లేబర్ కాలనీ మున్సిపల్ హైస్కూల్‌కు అందించారు. బ్యాంకు వైస్ చైర్మన్ బి.లక్ష్మీనారాయణశెట్టి, డైరెక్టర్లు ఎస్.హుస్సేన్‌అహ్మద్, సురేష్‌గుప్త, ఆర్.ఎం.విరుపాక్షిరెడ్డి చేతులమీదుగా వీటిని అందించారు. వారు మాట్లాడుతూ శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తూ లాభాలబాటలో ముందుకెళ్తోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రవి, టీచర్లు వీరభద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

నందవరం : మండల కేంద్రంలోని నందవరంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తునట్లు మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశానికి స్థల పరిశీలన చేశారు. మండల కేంద్రంలోని మునిస్వామి సినిమా హాల్‌లో ఉదయం 11:00 గంటలకు సమావేశం ఉంటుందన్నారు.

రైతు అన్నం తినేలోపు ఎద్దు మృతి

పెద్దకడబూరు : రైతు అన్నం తినేలోపు తన రెండు ఎద్దుల్లో ఒకటి మృత్యువాత పడ్డ సంఘటన మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. జాలవాడి గ్రామానికి చెందిన సునీల్‌కుమార్ అదే గ్రామంలోని చంద్ర అనే రైతు పొలంలో గుంటక పాయడానికి వెళ్లాడు. మధ్యాహ్నం వరకు గుంటక తోలి అన్నం తినడానికని ఎద్దులను పక్కనే ఉన్న పొలం గట్టున మేతకు వదిలాడు. అనంతరం అన్నం తిని తిరిగి ఎద్దులను గుంటక కట్టాలని వెళ్లగా ఒక ఎద్దు విగతజీవిగా పడి ఉండడాన్ని గమనించాడు. అది ఎందువల్ల చనిపోయిందో అర్థకాక బోరున విలపించాడు. తన జీవనార్థం నెల క్రితమే రూ.1.20లక్షలు పెట్టి రెండు ఎద్దులను కొనుగోలు చేశానని, ఎద్దు చనిపోవడంతో కుటుంబం రోడ్డున పడే పరిస్థితి దాపరించిందని వాపోయాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

ఇష్టంతో చదవాలి

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతోనే చదవాలని ఆదర్శ మిత్ర మండలి ప్రధాన కార్యదర్శి జి. కేశవయ్య అన్నారు. శనివారం పట్టణంలోని చిన్మయ మిషన్ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు 20 మందికి ఆర్థికంగా ప్రోత్సాహం అందించారు. అలాగే విద్యానగర్‌లోని ఎస్‌ఎంకేవీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్, కంప్యూటర్, జిరాక్స్ మరియు ప్రింటర్‌ను అందించారు. విరుపాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్‌ను అందించారు. కార్యక్రమంలో ఆదర్శ మిత్ర మండలి సభ్యులు సూరపూడి అనంత్, రవి ప్రకాష్ రెడ్డి, శ్యామ్ సుందర్, శ్రీవాణి, ఉమా శంకర్, అతిథులు డాక్టర్ విద్య, డా. నిర్మల తదితరులు పాల్గొన్నారు.





ఎమ్మిగనూరు బీసీ బాలుర హాస్టల్‌లో ఇరుకు గదిలో పడుకున్న విద్యార్థులు, స్నానపు గదులకు వాకిలే లేని దృశ్యం.



మంత్రాలయంలో హాస్టల్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు.



కోసిగి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో దుప్పట్లు లేకుండా పడుకున్న విద్యార్థులు

సమస్యల నిలయాలు

- సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు సౌకర్యాలు కరువు
- చాలా చోట్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్న వైనం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



ఆదోని బీసీ బాలుర వసతి గృహంలో ఇరుకైన గదిలో విద్యార్థుల అవస్థలు



మంత్రాలయంలో చిత్తడిలోనే భోజనాలు చేస్తున్న హాస్టల్ విద్యార్థులు

ఆదోని సెంట్రల్ : బడుగు బలహీన వర్గాల వారు తమ పిల్లలకు ఎన్నో ఆశలతో చదివించేందుకు వసతి గృహాల్లో వదిలితే అక్కడ సరైన వసతుల్లేకపోవడంతో వారు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు, తాగునీరు. మరుగుదొడ్లు వంటి సౌకర్యాలతో పాటు పండుకోవడానికి అవసరమైన దుప్పట్లను కూడా ఇవ్వాల్సి ఉంది. అయితే ప్రభుత్వం అవేమీ పట్టించుకోవడం లేదు. కొన్ని చోట్ల సొంత భవనాలు లేక అద్దెభవనాల్లో ఇరుకైన గదుల్లోనే విద్యార్థులు సద్దుకోవాల్సి వస్తోంది. హాస్టల్ స్థితిగతులపై ఇటీవల హైకోర్టు కూడా ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

హాస్టళ్లలో సమస్యలు

- ఆదోని నియోజకవర్గంలో బాలికల ఇంటిగ్రెటెడ్ వసతి గృహంతో పాటు ఎస్సీ, బీసీ బాలుర, బాలికల వసతి గృహాలతో పాటు కళాశాల వసతి గృహాలు ఉన్నాయి. అయా వసతి గృహాల్లో 1800 మంది దాక విద్యార్థులు ఉన్నారు.
- బీసీ బాలుర వసతి గృహంలో 240 మంది విద్యార్థులు ఉన్నారు. అక్కడ ఉన్నది 10 గదులు ఉంటే అందులో ఒకటి స్టాక్ రూమ్, ఒకటి వార్డన్ గది, మరొకటి వంట గది, ఒకటి రీడింగ్‌రూమ్ పర్పస్ కింద పెట్టారు. మిగిలిన ఆరు గదులలో విద్యార్థులు ఉన్నారు. అయా గదులలో విద్యార్థుల పెట్టెలు, బకెట్లు పెట్టుకొని ఆ ఇరుకు గదులలోనే కాలం వెళ్లదీస్తున్నారు. స్థలం లేక పోవడంతో చాల మంది వరండాలో ఏర్పాటు చేసిన ర్యాక్‌లలో తమ సామాన్లు పెట్టుకుటున్నారు. విద్యార్థులకు అనుగుణంగా బాత్ రూమ్స్, టాయిలెట్స్ లేవు.
- పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని అద్దెభవనంలో కొనసాగిస్తున్నారు. ఇందులో 160 మంది విద్యార్థినులు ఉన్నారు. మరుగుదొడ్ల సౌకర్యం అంతంత మాత్రంగానే ఉన్నాయి. తాగునీటి విషయానికి వస్తే మున్సిపల్ నీళ్లు కుళాయిలకు వదిలినపుడే పట్టుకోవాలి. దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ సంపును ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేయాలి, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్ల సౌకర్యాలను కల్పించాలి. వసతి గృహం తగ్గులో ఉండడం వలన వర్షం వస్తే నీరు అంతా లోపలికి వస్తున్నాయి.
- ఇంటిగ్రేటెడ్ వసతి గృహంలో 560 మంది విద్యార్థినులు ఉన్నారు. అక్కడ కూడా విద్యార్థులకు అనుగుణంగా బాత్‌రూమ్స్, టాయిలెట్స్ వంటి సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.
- వసతి గృహాలు ప్రారంభించి నెలలు గడుస్తున్నా ఇంత వరకు కార్పెట్, దుప్పట్లు పంపిణీ చేయలేదు. ఇంటి నుంచి తెచ్చుకొన్న దుప్పట్లుతోనే కాలం వెళ్లదీస్తున్నారు.
- గతంలో విద్యార్థులు బట్టలు సర్దుకోవడానికి ట్రంకు పెట్టెలు పంపిణీ చేసేవారు అయితే అవి కూడా ఇవ్వడం లేదు. దీంతో విద్యార్థులు ఇంటి నుంచే ట్రంకు పెట్టెలు, బకెట్లను తెచ్చుకుంటున్నారు.
- పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. బాలికల



మంత్రాలయంలో నిరుపయోగంగా మరుగుదొడ్లు

వసతి గృహంలో 205 మంది విద్యార్థులు ఉన్నారు. సరైన బాత్ రూమ్స్, టాయిలెట్స్ వంటి సౌకర్యాలు లేవు. దీంతో విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక వార్డన్ స్పందించి బిల్డింగ్ ఓనర్‌లకు నచ్చ చెప్పి కొన్ని నిర్మాణాలు చేపట్టారు.

- బీసీ ప్రభుత్వ బాలికల, బాలుర వసతి గృహాలు కూడా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. విద్యార్థులు చాలీ చాలనీ సౌకర్యాలతో ఇబ్బందులకు గురవుతున్నారు.

అద్దెభవనాల్లో అరకొర వసతులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో బీసీ బాలుర, బాలికల సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు లేకపోవడం, వున్నవి శిథిలం కావడంతో అద్దె భవనాల్లో వసతి గృహాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. వసతి గృహాల్లో సరైన వసతుల్లేక పట్టణంలోని ఎస్సీ, బీసీ పోస్ట్‌మెట్రిక్, ప్రీమెట్రిక్ సంక్షేమ వసతి గృహాలు అరకొర వసతులతో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. గుడికల్ రోడ్డులోని బీసీ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లో దాదాపు 300ల మంది వుంటున్నారు. వీరికి కేవలం 7 గదులున్నాయి. అవి కూడా పై అంతస్తులో వుండటం స్నానపు గదులు, మరుగుదొడ్లకు కింద వుండటంతో రాత్రి వేళల్లో ఎలాంటి ప్రహరి లేని భవనం నుంచి కిందకు దిగిరావాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. హాస్టల్‌లో స్నానపు గదులకు వాకిళ్లు విరిగిపోయాయి, కొన్నిటికి డోర్‌లే లేవు. ప్రీమెట్రిక్ బీసీ బాలుర వసతి గృహంలో 250మందికి పైగా వుండటంతో వారికి 16 స్నానపు గదులున్నాయి. దీనికితోడు కాస్మోటిక్ చార్జీలతో పాటు దుప్పట్లు, పెట్టెలు మంజూరుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పట్టణంలోని బీసీ ప్రీమెట్రిక్ హాస్టల్ భవనం గీతామందిర్ సమీపంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇందులో 225 మంది వుండగా ప్రస్తుతం మరో 200ల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. వీరికి కేవలం 10 గదులుండగా..

వేధిస్తున్న గదుల కొరత

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో గదుల కొరత విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోంది. 110 మంది విద్యార్థులకు కేవలం 4గదులనే కేటాయించారు. ఇంకా అడ్మిషన్‌లు జరుగుతున్నాయి. ఇంకో 30మందికిపైగా ఇక్కడ జాయిన్ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే గదుల కొరత ఉంటే ఇంకా విద్యార్థులు జాయిన్ అయితే వారి పరిస్థితి ఏమిటో అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. అదేవిధంగా బాత్‌రూమ్‌లు, టాయిలెట్‌లు దుర్వాసన వెదజల్లుతున్నాయి. కొత్తగా మరుగుదొడ్లు కట్టినా ఇంకా వాడుకలోకి రాకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. హాస్టల్ ఆవరణంలో గడ్డిమొక్కలు పెరిగిపోవడంతో దోమలతో పాటు పాములు, తేళ్లు వంటివి వస్తాయేమోనని



పెద్దకడబూరు హాస్టల్‌లో విద్యార్థులు ఉన్న గదిలో మూలన పడేసిన మంచాలు

విద్యార్థులు భయపడుతున్నారు. తాగునీరు 3 లేదా 4రోజులకు ఒకసారి వస్తుండడంతో మిగిలిన రోజుల్లో విద్యార్థులు తాగునీటి కోసం పక్కనే ఉన్న పాఠశాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపరించింది. రోజూ ప్లాస్టిక్ బాటిల్స్ తీసుకొని పాఠశాల దగ్గరకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిందే.

స్నానపుగదులు, మరుగు దొడ్లు సరిపడలేక పోవడంతో విద్యార్థినులు పడుతున్న అవస్థలు వర్ణణాతీతం. అత్యవసర పరిస్థితిలో తమ బాధ ఎవరితోను చెప్పుకోలేనివిధంగా వుంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటికి అవస్థలు

మంత్రాలయం రూరల్ : మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు మౌలిక వసతులు కరువయ్యాయి. హాస్టల్‌లో 133 మంది విద్యార్థులు ఉన్నారు. కనీసం భోజనం చేసిన తరువాత తాగు నీరుకు కూడా లేక కుళాయి నీటితో సరిపెట్టుకుంటున్నారు. నెల కిత్రం వేసిన రేకుల షెడ్డుల నుంచి వాన నీరు విద్యార్థులు భోజనం చేసే చోట్టే కారుతుంది. రాత్రి పూట మరుగు దొడ్లకు వెళ్లాంటే విద్యుత్ బల్బులు లేక విద్యార్థులు చీకట్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 6 మరుగు దొడ్లు, 6 టాయిలెట్లు పూర్తిగా దెబ్బతిని, వినియోగంలో లేవు. 3 రూముల్లో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్క రూములో 20 మంది విద్యార్థులు చొప్పున వసతి కల్పించడంతో ఇరుకు గదుల్లో నిద్రించక ఇబ్బందులు పడుతున్నారు. రూముల్లో శుభ్రత లేదు, భద్రత కూడా లేదు. తాగునీరు లేక హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుళాయి నీరే అన్నింటికీ వినియోగిస్తున్నారు. బోరు ఉన్న వినియోగం లేదు. కనీసం మోటార్ కూడా వేయలేదు. బోరు మోటార్ వేస్తే కొంత వరకు నీటి సమస్య పరిష్కరమవుతుందని, బోరు వాటర్‌కు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగు నీరు అందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం



ఉదయం, రాత్రి తాగునీటి కోసం పక్కనే ఉన్న పాఠశాలకు వెళ్లి తెచ్చుకుంటాం. ఎవరి బాటిళ్ల వారు తెచ్చుకోవాల్సిందే. లేకపోతే తాగడానికి నీళ్లు ఉండవు. గదులలో కూడా ఒకరిపక్కనే మరోకరు కొంచెం కూడా స్థలం లేకుండా పడుకుంటున్నాం.
–సాయి, 8వ తరగతి, పెద్దకడబూరు

హాస్టల్ చుట్టూ దుర్వాసన వస్తోంది



మాది సొంత గ్రామం దుద్ది. మా అమ్మనాన్న అనుమంతమ్మ, దుబ్బయ్యలు కూలీ పనులకు వెళ్లి నన్ను చదివిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ హాస్టల్లో 3 ఏళ్లుగా ఉన్నాను. హాస్టల్‌లో చుట్టూ దుర్వాసన వెదజల్లుతోంది. రాత్రిల్లో కరెంట్ లేకపోతే అంధకారంలో ఉండాల్సి వస్తోంది. హాస్టల్‌లో ఇన్వర్టర్ ఉన్నా పనిచేయడం లేదు. –నవదీప్ కుమార్, 8వ తరగతి, కోసిగి

దుప్పట్లు ఇవ్వలేదు



ఇంటి గ్రేటెడ్ హాస్టల్ ఉంటూ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. హాస్టల్‌లో దుప్పట్లు ఇవ్వలేదు. కిటికీల తలుపులు పగిలిపోవడంతో దుర్వాసన వస్తోంది. అలాగే రాత్రిల్లో చలి వేస్తుంది. కిటికీలు పగిలిపోయాయి. దోమలు విపరీతంగా ఉన్నాయి. రాత్రిల్లో ఉండాలంటే భయం వేస్తోంది. –రాజరత్నం, 8వ తరగతి, కోసిగి

సౌకర్యాలు కల్పించాలి



వసతి గృహాల్లో చాలి చాలనీ వసతి సౌకర్యాలతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. సౌకర్యాలను కల్పించాల్సిన పాలకులు పట్టించుకోవడం లేదు. రుచికరమైన ఆహారంతో పాటు మంచి నీరు అందించాల్సి ఉంది. అయితే అవి ఏమి పట్టించుకోవడం లేదు. టాయిలెట్స్, బాత్ రూమ్స్ వంటి సౌకర్యాలు అరకొరగా ఉన్నాయి. వీటన్నిటి పరిశీలించి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు పాలకులు, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.
–వీరేష్, డీవైఎఫ్ఐ జిల్లా వైస్ ప్రసిడెంట్, ఆదోని

ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో భద్రత కరువు

కోసిగి: జిల్లాలోనే పశ్చిమ ప్రాంతమైక కోసిగి మండలం నుంచి అత్యధికంగా ప్రజలు బతుకుదెరువు కోసం వలస బాట పడుతున్నారు. తమ పిల్లలను హాస్టల్‌లో ఉంచి చదివించుకోవాలని వదిలి వెళ్లతున్నారు. అయితే విద్యార్థులకు హస్టల్‌లో భద్రత కరువైంది. మండల కేంద్రం కోసిగిలో ఇంటి గ్రేటెడ్ హాస్టల్‌ను పాత సంతమార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేశారు. హాస్టల్‌లో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 131 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టల్ ఎడమ భాగంలో మహిళల బహిర్భూమి ప్రాంతం ఉంది. వెనుక భాగంలో ఎగువ ప్రాంతాలు, హాస్టల్ నుంచి వచ్చే మురుగు నీరు ప్రవహిస్తోంది. ముందు భాగంలో చెత్తసంపద సృష్టి కేంద్రం ఏర్పాటు చేసి నిరుపయోగంగా వదిలేశారు. దీంతో పందులు స్వైర్య విహారం చేస్తున్నాయి. ఇలా హాస్టల్ చుట్టూ కంపు కొడుతోంది. చీకటి అయితే చాలు హాస్టల్ ముందు భాగం బహిర్భూమిగా మారిపోతుంది. పగటి సమయంలో కోతులు బెడద ఉంది. హాస్టల్‌కు ఏర్పాటు చేసి కిటికిల గ్లాసు తలుపులన్నీ ధ్వంసమైపోయాయి. రాత్రిల్లో కిటికిలకు తలుపులు లేక పోవడంతో చల్లటి గాలులు వీస్తుండడంతో పాటు దోమలు రావడంతో విద్యార్థులు ఇబ్బందికరంగా మారింది. వార్డెన్ రాత్రిళ్లు ఉండడం లేదు. వాచ్‌మెన్ ఉండడం లేదు, రాత్రిల్లో విద్యార్థులకు పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో రాత్రిల్లో విద్యార్థులు ఇష్టారాజ్యంగా బయటకు వచ్చేస్తున్నారు. రాత్రిల్లో విద్యుత్ సౌకర్యం పోతే అంధకారంలో ఉండిపోవాల్సి వస్తోంది. ఇన్వర్టర్ ఉన్నా నిరుపయోగంగా ఉంది. దీంతో తల్లిదండ్రులు హాస్టల్‌లో విద్యార్థులను ఉంచాలంటే భయాందోళన చెందుతున్నారు. గతేడాది హస్టల్‌లో 210 మంది దాకా ఉండే విద్యార్థులు ప్రస్తుతం 131 మంది మాత్రమే ఉండడం గమనార్హం.

పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఎమ్మిగనూరురూరల్: పేదరిక నిర్మూలనకు పీ–4 విధానం, సమాజ అభివృద్ధికి అందరూ భాగస్వాములు కావాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో స్వర్ణాంధ్ర విజన్–2047 ప్లాన్‌లో భాగంగా పీ–4పై ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజలు, స్వచ్ఛంధ సంస్థల భాగస్వామ్యంపై తాలూకా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద, నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం అందరిని భాగస్వాములను చేసిందన్నారు. సమాజంలో ఉన్నతస్థాయిలో ఉన్న 20 శాతం సంపన్నులు కిందిస్థాయిలో ఉన్న 10 శాతం నిరూపేద కుటుంబాలను వ్యక్తిగతం, కుటుంబం, సంస్థ లేదా సామాజిక రూపంలో సహాయం అందచేయాలని తెలిపారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, మండల ప్రత్యేకాధికారిణి బీసీ సంక్షేమ అధికారి ప్రసన్న, తహసీల్దార్లు శేష ఫణి, శ్రీనివాసులు, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆడపిల్లల భద్రతకు శక్తి యాప్



మాట్లాడుతున్న ఆదోని డీఎస్పీ హేమలత

ఆదోని రూరల్: ఆడపిల్లల భద్రతకు శక్తి యాప్ ఆయుధం లాంటిదని ఆదోని డీఎస్పీ హేమలత అన్నారు. శనివారం మండలంలోని ఆరేకల్ గ్రామంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ క్రైమ్, ఈవ్‌టీజింగ్, రోడ్డు భద్రత నియమాలు, మొబైల్ వాడకం, బైకు రైడింగ్ వాటి ద్వారా శక్తిటీం అందిస్తున్న సేవలను వివరించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఆడపిల్లలను గుర్తు తెలియని వ్యక్తులు అసభ్యకరంగా మాట్లాడడం, ఇతర కార్యకలాపాలకు పాల్పడితే శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే పోలీసులు సత్వరమే స్పందిస్తారన్నారు. కార్యక్రమంలో తాలూకా సీఐ నల్లప్ప, ఎస్ఐ రామాంజినేయులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.63వేలు విరాళం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం వద్ద నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి శనివారం కర్నూలుకు చెందిన వీరయ్య ఆచారి, కుంటుంబ సభ్యులు రూ.63వేల నగదు అందజేసిన ట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలి పారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించారు.

సూపర్ సిక్స్ పేరుతో మోసం

కోసిగి: ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో మోసం చేసి ప్రజలకు ఎగనామం పెట్టారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వందగల్లు గ్రామంలో గ్రామ నాయకుడు కాల్వ లక్ష్మయ్య ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెట్టిన పథకాలు, నేడు కూటమి ప్రభుత్వం అచరిస్తు పథకాల తేడాను వివరించారు.



ప్రజలకు చంద్రబాబు మోసాలను వివరిస్తున్న పి. మురళీ మోహన్ రెడ్డి, నాయకులు

కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, పార్టీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, నాడుగేని నాగరాజు, షంషుద్దీన్, కాంట్రాక్టర్ నాగరాజు, రహీమ్, గానిగ వీరస్వామి, బుళ్లి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



జైలులోని స్టోర్ రూమ్‌లోని నిత్యావసర సరుకులను తనిఖీ చేస్తున్న జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ అన్నారు. శనివారం ఆదోని పట్టణంలోని సబ్‌జైలును సందర్శించారు. ఖైదీల వివరాలను, వారికి అందుతున్న సేవలపై జైలు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.రవిని అడిగి తెలుసుకున్నారు. జడ్జి మాట్లాడుతూ ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి వివరించారు. అనంతరం ఖైదీల హాజరు పట్టికను పరిశీలించి ఖైదీలకు ఏదైనా సమస్య వస్తే సంబంధిత మండల న్యాయ సేవాధికార సంస్థ వారిని సంప్రదించాలని సూచించారు. జడ్జి వెంట హెడ్ వార్డర్, లీగల్ ఎయిడ్ సి.ఆనంద్, జైలు సిబ్బంది, కోర్టు సిబ్బంది ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 18వ వార్డులో అనారోగ్యంతో మృతి చెందిన వడ్డే నాగరాజు భౌతిక కాయానికి శనివారం అవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్‌లు సోమేష్, శివగంగ, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ అబ్రార్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ నివాళులర్పించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక తరపున ప్రగాఢ సానుభూతి తెలిపి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. అదేవిధంగా 30వ వార్డులోని తిలక్ నగర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన మాల గంగమ్మ భౌతిక కాయానికి వార్డ్ ఇన్‌చార్జ్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొరిశెట్టి విశ్వనాథ్, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు విశ్వనాథ్ రమేష్, పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహుడులు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమాల్లో ముస్లిం మైనారిటీ పట్టణ కార్యదర్శి అల్తాఫ్, పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు బజారిరెడ్డి, గడ్డం అంజి, చంద్ర, సయ్యద్ ఫయాజ్, ఎస్‌ఎండీ షరీఫ్, కదిరికోట రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురం గ్రామం సమీపంలో శనివారం రాత్రి మోటార్ బైక్‌కు కుక్క అడ్డురావటంతో అదుపు తప్పి కిందపడటంతో పెసలదిన్నె గ్రామానికి చెందిన సుభాన్ అనే యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స కోసం 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

నందవరం : పల్లెల్లో పంచాయతీ అధికారులు, మండల అధికారులు పారిశుద్ధ్యం, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పుల్లయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముగతి గ్రామ ఎంపీటీసీ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో వాతావరణం, వర్షాల రాకతో తాగు నీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారని మండిపడ్డాడు. అధికారులు కనీసం గ్రామాలకు వెళ్లి పర్యవేక్షించడం లేదని విమర్శించారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టండి

కౌతాళం: రాజకీయాలకు అతీతంగా అధికారులు పనిచేయాలని ఎంపీపీ అమరేష్ అన్నారు. శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్పంచ్, ఎంపీటీసీల సమన్వయంతో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యాలు కల్పించి గ్రామాభివృద్ధికి అధికారులు సహకారం అందించాలన్నారు. గ్రామాల్లో తాగునీటిని ఫిల్టర్ చేసి వదలాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కోసం జాబ్ కార్డుకు దరఖాస్తు చేసుకుంటే 10 నుంచి 15రోజుల నుంచి చేస్తున్నారని నదిచాగి ఎంపీటీసీ లింగన్నగౌడ్ అన్నారు. అనంతరం ఎంపీటీసీలకు బకాయి ఉన్న మూడు సంవత్సరాల వేతనాలు వచ్చేల చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీలు ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఎంపీపీ అమరేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.